క్లుప్తంగా

యాగంటీశ్వరుడికి పల్లకీసేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వర స్వామికి సోమవారం పల్లకీ సేవాను ఘనంగా నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో స్వామికి అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయం చుట్టు పల్లకీ సేవా నిర్వహించారు.

ఆర్థికసాయం

కోవెలకుంట్ల: పట్టణంలోని కర్ణమయ్య వీధిలో నివాసం ఉంటున్న పేద యువతి వివాహానికి వైఎస్సార్‌సీపీ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి సోమవారం ఆర్థికసాయం అందించారు. కాలనీకి చెందిన షేక్ బుజ్జి కుమార్తె వివాహానికి తన వంతు సాయంగా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో రామిరెడ్డి సేవా సమితి సభ్యులు సరోజ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

శ్రీరామేశ్వరస్వామికి వెండి గిన్నె, నేత్రాల వితరణ



వెండి నేత్రాలు, గిన్నె అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలో వెలసిన శ్రీరామేశ్వర స్వామికి గ్రామానికి చెందిన డి రాజు, జ్యోతి దంపతుల కూతురు శిల్పా సుమారు 10 గ్రామాల వెండి గిన్నె, నేత్రాలను సోమవారం విరాళమిచ్చారు. అనంతరం దాత కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు భాస్కరయ్య అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు చల్లా మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొలిమిగుండ్లలో వైద్య శిబిరం

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్పెషలిస్టు వైద్యులు హాజరుకానున్న వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్: సమయ పాలన పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు పవన్ కోరారు. డోన్ డివిజన్ ఉప విద్యాధికారి కార్యాలయంలో సోమవారం సీనియర్ అసిస్టెంట్ జయరాం నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని శ్రీసుధ విద్యా సంస్థలు ఉదయం 6 నుంచి సాయిత్రం 7 గంటల వరకు క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఉల్లాసానికి దూరం చేస్తోందని ఫిర్యాదు చేశారు. అలాంటి విద్యాసంస్థలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామ సచివాలయ అద్దాలు ధ్వంసం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని నాల్గవ గ్రామ సచివాలయ భవన అద్దాలను గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. పట్టణ శివారులోని సాయిబాబా గుడి సమీపంలో ఉన్న సచివాలయ కిటికీలకు అమర్చిన గాజు అద్దాలను పగలగొట్టి వెళ్లిపోయారు. సోమవారం విధులకు హాజరైన సచివాలయ సిబ్బంది గమనించి ఈఓ గోపీనాథ్‌కు సమాచారం చేరవేశారు. అద్దాలు ధ్వంసం చేసిన విషయాన్ని ఈఓ కోవెలకుంట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఘనంగా మౌలాలి స్వామి ఉరుసు



మౌలాలి స్వామికి గంధం ఊరేగింపు దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో వెలసిన మౌలాలి స్వామి దర్గా గంధం, ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దర్గా ధర్మకర్త ఖాదర్ బాషా స్వామి వారికి గంధం సమర్పించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజలు చేశారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

కొలిమిగుండ్ల: తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దవెంతుర్ల ఎస్సీ కాలనీలో నిర్మించిన మారెమ్మ ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ట చేయనున్నట్లు సమరసత ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారకులు శ్రీనివాసులు సోమవారం తెలిపారు.

ఖరీఫ్ రైతుకు తీపి కబురు

- ఈ ఏడాది పలు పంటలకు మద్దతు ధర పెంపు
- వరి, పప్పు, చిరుధాన్యాలకు ప్రాధాన్యత
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయాలు
- దళారుల అక్రమాలకు చెక్
- జిల్లాలో 1.97 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ పంటలు
- రైతు సంక్షేమానికి పెద్దపీట

వ్యవసాయరంగానికి పెద్దపీట వేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతకు అడుగడుగునా అండగా నిలుస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయగా ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఏటా క్రమం తప్పకుండా రూ.13,500 పెట్టుబడి సాయం అందించడమే గాకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు సరఫరా చేసి, అధిక దిగుబడులు సాధించేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందజేస్తోంది. ఇప్పుడు పంటలకు ఇస్తున్న మద్దతు ధరను కేంద్రం పెంచడంతో దాన్ని అమలు చేసేందుకు జగనన్న ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులకు తీపి కబురు అందించింది. – కోవెలకుంట్ల



కోవెలకుంట్ల సమీపంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి

జిల్లాలో రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 41,526 హెక్టార్లలో వరి, 45,829 హెక్టార్ల మొక్కజొన్న, 30,550 హెక్టార్లలో కంది, 8,268 హెక్టార్లలో మినుము, 10,420 హెక్టార్లలో పత్తి, 5,840 హెక్టార్లలో ఆముదం, 5,620 హెక్టార్లలో సోయాబీన్, 13,822 హెక్టార్లలో మిరప, 2,832 హెక్టార్లలో టమోట, 2,442 హెక్టార్లల్లో ఉల్లి, మిగిలిన విస్తీర్ణంలో వివిధ రకాల ఇతర పంటలను సాగు చేశారు. ఆయా పంటల్లో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు తదితర పెట్టుబడుల రూపంలో రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు వెచ్చించారు. ఇప్పటికే కొన్ని పంటల్లో దిగుబడులు చేతికందగా మిగిలిన పంటలు వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లాలో 411 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సేవలందుతున్నాయి. ఆర్‌బీకేల నుంచి సకాలంలో రైతులకు విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు సరఫరా చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో వ్యవసాయ, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో ప్రభుత్వమే కేంద్రాలు ఏర్పాటు చేసి వరి, మొక్కజొన్న, జొన్న, తదితర పంట ఉత్పత్తులను కొనుగోలు చేసింది. దీంతో మార్కెట్‌లో దళారుల దందాకు చెక్ పడి రైతులు మంచి ధరకు విక్రయించి లాభాలు గడించారు. ఈ ఏడాది ప్రభుత్వం ముందే మద్దతు ధర నిర్ణయించడంతో వివిధ పంట ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది.



సొదరదిన్నె సమీపంలో ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులు

మద్దతు ధర పెంపు ఇలా..

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంచింది. గత ఏడాది గ్రేడ్–1 రకం వరి ధాన్యం క్వింటా రూ.2,183 కాగా ఈ ఏడాది క్వింటా రూ.2,203కు పెంచింది. సజ్జలు రూ.2,350 నుంచి రూ.2,500లు, రాగులు, రూ. 3,578 నుంచి రూ.3,846, కందులు రూ.6,600 నుంచి రూ.7వేలు, పెసలు రూ.7,755 నుంచి రూ.8,558, జొన్న రూ. 2,970 నుంచి రూ.3,180 వరకు పెంచారు. వీటితోపాటు పత్తి, పొద్దుతిరుగుడు, వేరుశనగ తదితర పంటలకు గత ఏడాదితో పోలిస్తే మద్దతు ధర పెరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈక్రాప్ నమోదు ఆధారంగా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నారు. వాతావరణం అనుకూలించి వివిధ పంటల్లో ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తుండటం, మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో ఈ ఏడాది ఖరీఫ్ అన్ని విధాలా కలిసి వచ్చిందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు ధర పెంపు శుభ పరిణామం



గతంలో పంట దిగబడులు అమ్ముకునేందుకు అవస్థలు తప్పేవికాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకు కష్టాలు తీరాయి. ఈ ఏడాది నాకున్న ఐదు ఎకరాల్లో జొన్న, శనగ పంటలు సాగు చేశాను. ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా దిగుబడులు అమ్ముకునే ఆస్కారం లభించింది.

– రమణారెడ్డి, రైతు, సొదరదిన్నె, కోవెలకుంట్ల మండలం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



దిగుబడులను దళారుల చేతిలో పెట్టకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పెరిగిన మద్దతు ధర రైతులకు మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వరి, జొన్న, కంది, మినుము, పెసర, తదితర పంటలకు మద్దతు ధర ఆశాజనకంగా ఉంది.

– నిరంజన్, ఏఓ, కోవెలకుంట్ల

నేడు జాబ్ మేళా

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన హెట్రో ల్యాబ్స్ లిమిటెడ్ కంపెనీలో ప్రొక్షన్స్, క్వాలిటీ కంట్రోల్,ఇంజినీరింగ్ విభాగాల్లో ఉద్యోగ నియామకాల కోసం ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.డిగ్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీ.ఫార్మసీతో పాటు ఇంజినీరింగ్ విభాగానికి డిప్లమో ఇన్ మెకానికల్, ఐటీఐ ఫిట్టర్, 2020 –2023 మధ్యలో పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన శైవ పుణ్యక్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆశ్వయుజ మాస సోమవారం పూజలు భక్తులు వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అర్చకుడు చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. బుగ్గానిపల్లె గ్రామ సమీపంలో వెలసిన బ్రహ్మ సూత్ర సహిత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త చిన్ని శేషఫణి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు.

ప్రాక్టీస్ పరీక్షల పరిశీలన

అవుకు: పట్టణ సమీపంలోని ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే ప్రాక్టీస్ పరీక్షలను ఎంఈఓ శ్రీధర్ రావు సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను గుర్తించటానికి 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నవంబర్ 3న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎస్ఈఏఎస్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

– అవుకు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల(ఎస్సీ)ను ఎంఈఓ–2 వెంకటేశ్వర రెడ్డి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాల ఆవరణను పరిశీలించి వంట ఏజెన్సీ సిబ్బందికి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

మెగా సీఫుడ్ ఫెస్టివల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: కర్నూలులోని రావూరి గార్డెన్‌లో నవంబరులో 3, 4, 5వ తేదీల్లో ఏర్పాటు చేయనున్న మెగా సీఫుడ్ ఫెస్టివల్‌ను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. సోమవారం ఆయన తన స్వగృహంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సంధ్యారాణితో కలిసి ఫెస్టివల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు ప్రభుత్వం ఇచ్చే యూనిట్లతో పాటు రూ.కోటి విలువ గల యూనిట్లు ఏ విధంగా ఏర్పాటు చేసుకోవాలి, మార్కెటింగ్ ఎలా చేసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలు ఫెస్టివల్‌కు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పాపన్న, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ శిరోమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, మధు, రామసుబ్బయ్య గౌడ్, నాగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్‌లో పశువైద్య శిబిరం



ఆవుకు వైద్యం చేస్తున్న ఏడీఏ మారుతీసకారం

బనగానపల్లె: మండలంలోని ఫతేనగర్ గ్రామంలో సోమవారం యాగంటిపల్లె పశువైద్యాధికారి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గొంతువాపు, పిడుదుల నివారణకు ఏడీఏ మారుతీసకారం వైద్యం చేశారు. పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి రామ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పి.రామక్రిష్ణుడు, నీలకంఠం పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు జిల్లాగా ప్రకటించి పంటనష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నారాయణ కోరారు. సోమవారం దొరపల్లె, కామగాని కుంట్ల గ్రామ సచివాలయాల్లో కార్యదర్శులను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రతి కుటుంబానికి కరువు భత్యం కింద 35 కిలోల బియ్యం, ప్రతి రైతు, వ్యవసాయ కుటుంబానికి నెలకు రూ.10 వేల పెన్షన్ అందివ్వాలని కోరారు. సంఘం మండల అధ్యక్షులు విజయుడు, నాయకులు రంగనాయకులు, పక్కీరప్ప తాత తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని 12 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు మూర్తుజావలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులు ఆరోగ్య సమస్యలతో వివిధ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించుకోగా వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో బైనపల్లె గ్రామానికి చెందిన మధుసూధన్‌రెడ్డికి రూ.5 లక్షలు, రహిమానుపురం బద్దెల పార్వతమ్మకు రూ.3.50 లక్షలు, బేతంచెర్లకు చెందిన రేగిమాను హిమబిందుకు రూ.2 లక్షలు, మరో 9 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బైకు చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో నివాసం ఉండే బ్రహ్మయ్య ఆచారి బైకును గుర్తు తెలియని వ్యక్తి సోమవారం తెల్లవారు జామున చోరీ చేశాడు. ఆదివారం రాత్రి ఇంటి బయట ఉంచిన బైకు చోరీకి గురైనట్లు బాధితుడు పట్టణ పోలీసుకు ఫిర్యాదు చేయగా స్పందించిన పోలీసులు సమీపంలోని సీసీ ఫుటేజ్ పరిశీలించారు. తెల్లవారు జామున ఓ వ్యక్తి బైకును చోరీ చేసినట్లు గుర్తించి, నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు

డోన్ టౌన్: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సుధాకర్, డాక్టర్ రవి రైతులకు సూచించారు. మండలంలోని కొత్తకొట గ్రామ పరిధిలో సాగు చేసిన పొలాల్లో వారు సోమవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. వేరు శనగ పంట సూర్పిడి దశకు రావడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం గ్రామంలో ప్రయోగాత్మకంగా నూతన వంగడాలతో చేపట్టిన వేరు శనగ పంటను పరిశీలించి దిగుబడులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు చంద్రన్న, ఆర్‌బీకే వ్యవసాయ సహాయకురాలు దస్తగిరమ్మ పాల్గొన్నారు.

హాస్టల్‌కు భవనం కేటాయించాలి

డోన్ టౌన్: పాత మున్సిపల్ భవనాన్ని కళాశాల హాస్టల్ భవనానికి కేటాయించాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా నాయకులు తెలుగు విజయ్‌కుమార్ కోరారు. సోమవారం పాత మున్సిపల్ కార్యాలయం భవనం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ ఐటీఐలో నిర్మాణంలో ఉన్న హాస్టల్ భవనం పూర్తి కాలేదని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు అద్దె హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. శాశ్వత భవనాలు కేటాయించే వరకు నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ నాయకులు సునీల్, మధు, అజయ్, చరణ్, మధు, జగన్, సురేంద్ర, దస్తగిరి, అభి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం కానాల గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని తెలియజేసి, ఆ వివరాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ స్తంభాలు, ఇళ్లు, సీసీ రోడ్లు కావాలని స్థానికులు కోరగా స్పందించిన ఎమ్మెల్యే ప్రజలకు కావలసి సదుపాయాలను సమకూర్చాని అధికారును ఆదేశించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పోచా శీలా రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు పద్మావతమ్మ, సర్పంచ్ పెద్ద పెద్దయ్య, ఎంపీడీఓ నాగకుమార్, లింగందిన్నె సచివాలయ కన్వీనర్ అన్నె శివరామిరెడ్డి, నాయకులు కూడాల చంద్రశేఖర్ రెడ్డి, పులి పుల్లారెడ్డి, బాల మద్దిలేటి, రొక్కం సిమోన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కమలపూరిలో..

సంజామల మండలంలోని కమలపూరిలో మంగళవారం మధ్యాహనం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డి ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

పీఆర్ పల్లిలో వైద్యశిబిరం



వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న వైద్యుడు

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 551 మందికి వైద్యులు నుస్రత్ ఉ జొహరా, నితీశ్, సహృదయ్, అభినయ్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, సర్పంచ్ మహేశ్వరి, ఉప సర్పంచ్ ప్రేమసాగర్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు పలుకూరులో వైద్యశిబిరం

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామ సచివాలయం–1లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య సోమవారం తెలిపారు. డాక్టర్లు మధుమోనిక, లక్ష్మి, శివశంకరుడులతో పాటు పలువురు వైద్యులు హాజరై శిబిరానికి వచ్చిన రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ట్రాక్టర్ బోల్తా

- ఇద్దరికి గాయాలు

అవుకు: మండల పరిధిలోని శింగనపల్లె రహదారిలో సోమవారం ట్రాక్టర్ బోల్తా పడటంతో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. చనుగొండ్ల గ్రామానికి చెందిన పరశురాం తన ఇంటి నిర్మాణం కోసం అవుకు నుంచి ట్రాక్టర్‌లో సిమెంట్ బస్తాలను వేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి వస్తుండగా మార్గమధ్యలో గ్యాస్ గోడౌన్ వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న గురుడు, పరశురాం గాయపడ్డారు. క్షతగ్రాతులను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో భరద్వాజ్ జయంతి

డోన్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో కొలువైన శ్రీ పోలికి వరచిదంబరస్వామి సన్నిధిలో భరద్వాజ్ మాస్టర్ జయంతి వేడుకలను సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం శ్రీపోలికి వరచిదంబరస్వామి, భరద్వాజ్ మాస్టర్లకు ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు, పూజలు, మంగళ హారతులు నిర్వహించారు. విజయవాడకు చెందిన శ్రీనివాస్ చేత సత్సంగం, మధ్యాహ్నం హారతి, అన్న ప్రసాద వితరణ చేశారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం





ప్రభుత్వ పథకాలను వీక్షిస్తున్న దృశ్యం మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

- మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్ టౌన్: పేదల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డిలు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తిరునాంపల్లె తిరుమలరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడులు అన్నారు. స్థానిక షాదిఖానాలో సోమవారం గృహ సారథులకు, వలంటీర్లకు, సచివాలయ కన్వీనర్లకు వై నీడ్స్ జగన్ టూ ఏపీపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, డోన్ నియోజకవర్గంలో ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులపై వీడియో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి తేడా వివరించాలన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



మాట్లాడుతున్న శేషసేనరావు

డోన్ టౌన్: ప్రతి పిటిషన్‌పై రూ.20 విలువ స్టాంప్ అతికించాలన్న హైకోర్టు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం డోన్ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణంలో బార్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ శేషసేనారావు జనరల్‌బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నవంబరు 11వ తేదీ వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. 35 ఏళ్లు పైబడిన ప్రతి న్యాయవాదికి వెల్ఫేర్ ఫండ్ అవకాశం కల్పించాలని కోరారు. డెత్ బెనిఫిట్స్ రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, ప్రస్తుతం ఉన్నటువంటి వెల్ఫేర్ ఫండ్ రూ.100 నుంచి రూ.250 పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి బాలరంగడు, కోశాధికారి శ్రీనివాసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

దశలవారీగా కాలనీల అభివృద్ధి



మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలోని అన్ని కాలనీలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి తెలిపారు. సోమవారం వార్డు కౌన్సిల్ సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 20 వార్డులలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు. ఆయా కాలనీల్లో చేపట్టే అభివృద్ధి పనులతో పాటు డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించడం, ఎల్ఈడీ స్ట్రీట్ లైట్ల ఏర్పాటు, పూర్తయిన పనులకు చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపునకు తీర్మానం చేశారు. అవసరమైన చోట సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, గ్రావెల్ రోడ్ల ఏర్పాటుకు సంబంధించి చర్చించారు. కాలనీల్లో తాగునీటి సమస్య ఉందని వార్డు కౌన్సిలర్స్ విన్నవించగా వర్షభావ పరిస్థితుల వల్ల బోరుబావుల్లో భూగర్భ జలాలు ఇంకిపోయయాని యుద్ధ ప్రాతిపాదికన కొత్త బోర్లు వేయించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్ బాబు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పర్వీన్, వార్డు కౌన్సిలర్లు ఇబ్రహీమ్, చింతల నాగిరెడ్డి, హుసేన్‌బీ, షేక్ ముబీనా, ఎంగమ్మ, నాగజ్యోతి, మహేశ్వరి, సాయి, కోట్ల మధు, కో ఆప్షన్ సభ్యుడు ఎల్లయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

డోన్: 11వ వార్డులో సీసీ రోడ్ల పనులను సోమవారం మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల విషయంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నాణ్యత లేకుండా రోడ్లు, కాల్వలు నిర్మిస్తే బిల్లులు మంజూరు కావని హెచ్చరించారు. ఆయన వెంట వైఎస్సాసీపీ నాయకులు సతీష్, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, డీఈ రసూల్ పాల్గొన్నారు.